క్లుప్తంగా

మెటీరియల్ వితరణ



పోటీ పరీక్షల పుస్తకాలతో విద్యార్థులు

జలుమూరు: మండలంలోని యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన జుత్తు సింహాచలం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్‌ను హెచ్‌ఎం రఘుకు సోమవారం అందించారు. ఈ పుస్తకాలు ఎన్‌ఎంఎంఎస్, పదో తరగతి, ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడతాయని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వివరించారు. సుమారు రూ.25 వేల విలువ చేసేవి పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు



తహసీల్దార్ ప్రసాదరావుకు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

పాతపట్నం: మేజర్ పంచాయతీ పరిధి బాలాజీనగర్–3లోని రజకుల కాలనీలో రజకులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తహసీల్దార్ ఎన్.ప్రసాదరావుకు ఆ కాలనీ వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పోలాకి రేణుక, వార్డు మెంబర్ గొరిశెట్టి దుర్గారావు మాట్లాడుతూ గతంలో రజకులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొంతమంది కబ్జా చేశారన్నారు. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని, రజకులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దాసరి త్రినాథరావు, సురేష్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

63 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జెమ్స్ వైద్యులు

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామంలో అమ్మన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. తంగి సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో రాగోలు జెమ్స్ వైద్యులు ఈశ్వరరావు, హారిక వైద్య సేవలందించారు. 63 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేడి నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



హిరమండలం: ఎల్.ఎన్.పేట పీహెచ్‌సీ వైద్యురాలికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మేరీ కేథరిన్

హిరమండలం/కొత్తూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మేరీ కేథరిన్ అన్నారు. ఎల్.ఎన్.పేట పీహెచ్‌సీని, కొత్తూరు మండలంలోని కురిగాం పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, మందుల నిల్వలు, ఆస్పత్రి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. ఓపీ మరింత మెరుగవ్వాలన్నారు. వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా మెలగాలన్నారు. మందుల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు భూములకు హక్కులు కల్పించాలి

హిరమండలం: వంశధార మిగులు భూములకు సంబంధించి రైతులకు హక్కు కల్పించాలని నిర్వాసితులు అధికారులను కోరారు. జెడ్పీటీసీ పాగిరి బుచ్చిబాబు ఆధ్వర్యంలో నిర్వాసిత రైతులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అదనపు పరిహారం అందించినా.. రికార్డుల పరంగా సమస్యలు ఉండడంతో చాలా మందికి అందలేదన్నారు. ఒక్క పెద్దసంకిలి పరిధిలోనే 300 ఎకరాల మిగులు భూములు ఉన్నాయని, ఆ భూముల వద్దకు వెళ్లేందుకు సరైన మార్గం లేదన్నారు. నిర్వాసిత గ్రామాలు ఖాళీచేసి పదేళ్లు అవుతున్నా మిగులు భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించలేదన్నారు. దీంతో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలకు రైతులు దూరమయ్యారన్నారు.

ప్రయాణికులు లేకపోవడంతో కొత్తూరు స్టాండ్‌లో నిలిచిపోయిన ఆటోలు



ఆటోవాలా.. డీలా..

- కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల బతుకులు కుదేలు
- ఉపాధి కోల్పోయిన వైనం
- ఈఎంఐలు చెల్లించలేక అవస్థలు

కొత్తూరు: సొంత ఊరిలో ఉండి ఆటోలను తిప్పుతూ వచ్చే ఆదాయంతో ఎంతో మంది నిరుద్యోగులు కుటుంబాలను పోషించుకుంటున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత మొత్తం ఆటో అప్పులకు చెల్లించి.. మిగిలిన మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయడంతో ఆటో డ్రైవర్ల బతుకులు ఒక్కసారిగా కుదేలయ్యాయి.

మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడంతో బేరాలు తగ్గిపోయాయి. కొత్తూరు కేంద్రంగా హిరమండలం, మెట్టూరు, గొట్టిపల్లి, అంగూరు, ఒడిశా రాష్ట్రంలోని హడ్డుబంగి, పార్వతీపురం మన్యం జిల్లాలోని పూతికవలస, సీతంపేట, భామిని, బత్తిలిపాటు పలు గ్రామాలకు రోజుకు వందలాది ఆటోలను తిప్పుతున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుకు ముందు ఒక్కో ఆటో రోజుకు రెండు నుంచి మూడు ట్రిప్పులు తిరిగితే రూ.500 నుంచి రూ.800 వరకు ఆదాయం వచ్చేది. అప్పులు తీర్చడంతోపాటు కుటుంబ పోషణ, పిల్లలు చదువులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడేవి. స్త్రీ శక్తి పథకం అమలు చేసిన నుంచి రోజుకు ఒక ట్రిప్పు మాత్రమే తిరగడంతో రూ.500 కూడా రాని పరిస్థితి నెలకొంది. ఆటోల కోసం ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వద్ద చేసిన అప్పులు చెల్లించేకపోవడంతో ఏ రోజు ఆటో తీసుకుపోతారో అన్న భయం డ్రైవర్లకు వెంటాడుతోంది. ఆటో నడపడం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఆటోలు అమ్మేందుకు ముందుకు వస్తున్నా కొనేనాథుడు లేక డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. ఆపదలో ఉన్న ఆటో డ్రైవర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ప్రయాణికులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న ఆటో డ్రైవర్లు

ఒక్క ట్రిప్పుకు మాత్రమే అవకాశం



ఉచిత బస్సులు కారణంగా కొత్తూరు నుంచి హడ్డబంగి వరకు ఒక ట్రిప్పుకు మాత్రమే అవకాశం వస్తోంది. గతంలో రెండు నుంచి మూడు ట్రిప్పులు వచ్చేవి. రోజుకు కనీసం రూ.500 ఆదాయం కూడా రావడం లేదు.

– అలిబిల్లి నీల్‌కమల్, ఆటో డ్రైవర్, నివగాం, కొత్తూరు మండలం

ఆటోలు అమ్ముతామన్నా కొనడం లేదు



కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులు వేయడంతో ఆటోలకు ఒక్కసారిగా గిరాకీ తగ్గింది. దీంతో ఉపాధి కోల్పోయాం. ఆటోలు నడపడం కష్టంగా ఉన్నందున అమ్మేందుకు ముందుకు వస్తున్నప్పటికీ కొనుగోలు చేసేందుకు ఎవరూ సుముఖత చూపడం లేదు.

– దుంపల రాజు, ఆటో డ్రైవర్ కుంటిభద్ర కాలనీ, కొత్తూరు మండలం

బంగారాన్ని కుదువ పెట్టాను



సంవత్సరాల తరబడి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. బంగారం కుదువ పెట్టి ఆటో కొనుగోలు చేశాను. ఉచిత బస్సులు రావడంతో ఆదాయం పూర్తిగా తగ్గింది. ప్రైవేట్ బ్యాంకులో ఉండిపోయిన బంగారాన్ని ఎలా విడిపించాలో తెలియడంలేదు.

– నీలం నాయుడు, ఆటో డ్రైవర్, కుంటిభద్ర, కొత్తూరు మండలం

వేకువజాము నుంచే నిరీక్షణ..



ప్రయాణికుల కోసం వేకువజాము నాలుగు గంటలకు ఆటోను క్యూలో పెట్టడం జరుగుతోంది. మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం కావడంతో ఆటోలకు రావడం లేదు. రోజంతా నిరీక్షిస్తే ఒక్క ట్రిప్పుకు అవకాశం వస్తోంది. తక్కువ ఆదాయం రావడంతో ఈఎంఐలు, ఆయిల్‌కు కూడా చాలడం లేదు.

– పి.శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, కుంటిభద్ర, కొత్తూరు మండలం

ఏకపక్షంగా వ్యవహరించడం తగదు



ఏఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సరుబుజ్జిలి: అధికార పక్షానికి కొమ్ముకాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మండల వ్యవసాయాధికారి మన్మథరావు తీరును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు తప్పుబట్టారు. సోమవారం ఎరువుల సమస్యపై వ్యవసాయాధికారితో మండల కేంద్రంలో పార్టీ నేతలు, రైతులతో కలిసి మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల వద్ద పంపిణీ చేయాల్సిన ఎరువులను ప్రైవేట్ వ్యాపారుల వద్ద నిల్వ చేసి కూటమి నేతలు చెప్పినవారికి అందజేయడం ఎంతవరకు సమంజసమని ఏఓను నిలదీశారు. మీ సమీప బంధులకు, కూటమి నేతలు సిఫార్స్ చేసిన వారికి ఎరువులు అందిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అందరికీ ఎరువులు అందించామని ప్రకటనలు చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో సగం మంది రైతులుకు కూడా అందించిన దాఖలాలు లేవన్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఎరువు ఎటు తరలించారని ప్రశ్నించారు. అందరికీ సమానంగా చూడాల్సిన ప్రభుత్వ అధికారే అధికార పక్షానికి కొమ్ముకాయడం ఎంతవరకు సమంజసమన్నారు. రైతులుకు అందాల్సిన ఎరువుల కోసం ప్రజాప్రతినిధులు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడాన్ని, వ్యవహార శైలిని మార్చుకోవాలన్నారు.

స్త్రీశక్తి పథకం అమలులో ప్రభుత్వం విఫలం

- ఏం సాధించారని విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారు..
- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ



సరుబుజ్జిలి: స్త్రీశక్తి పథకం అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. పల్లెలకు పూర్తి స్థాయిలో బస్సులు సర్వీసులు లేవవని, అలాంటప్పుడు ఉచిత బస్సు పథకం విజయవంతమైనట్లు ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రాష్ట్రంలో దాదాపు 1000 బస్సులు అవసరం కాగా.. కొత్త బస్సులు కొనగోలు చేయకుండా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

రాష్ట్రంలో 50 శాతం పల్లె ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సులు లేవన్న విషయం కూటమి నేతలు తెలుసుకోవాలన్నారు. పరిమితి స్థాయిలో బస్సులు వేసి, వాటికి కొన్ని నిబంధనలు పెట్టారన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో పల్లె వెలుగు బస్సుల కోసం మహిళలు రోజంతా వేచి చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, మూడడ్ల రమణ, లావేటి విశ్వేశ్వరరావు, బద్రి రామారావు, ప్రకాశ్, శేఖర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చేరిన బిల్లులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన గోకులం షెడ్లకు చెందిన బిల్లుల మొత్తం లబ్ధిదారులకు సంబంధిత సిబ్బంది సోమవారం అందజేశారు. ఉపాధి హామీలో అక్రమాలు అనే శీర్షికన సాక్షిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ మోహన్‌కుమార్ స్పందించారు. గోకులం షెడ్లు నిర్మించిన లబ్ధిదారులకు కాకుండా వెండర్ ఖాతాకు జమ చేసిన సొమ్మును బ్యాంకు ఖాతా నుంచి వారితోనే విత్‌డ్రా చేయించారు. అవకతవకలకు పాల్పడిన ఉపాధి సిబ్బందితోనే ఆ పంచాయతీలోని పెద్దల సమక్షంలో లబ్ధిదారులకు బిల్లుల మొత్తం అందజేశారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

వాహనదారుల అవస్థలు



గొట్టిపల్లి అండర్ బ్రిడ్జి కిందకి చేరిన వర్షంనీరు



శ్రీకాకుళం వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో వాహనదారుల అవస్థలు

- గొట్టిపల్లి అండర్ పాసేజ్ వద్ద వర్షం నీరు నిల్వ

నరసన్నపేట: మండంలోని గొట్టిపల్లి అండర్ బ్రిడ్జి వద్ద, సర్వీసు రోడ్డుకు రెండు వైపులా వరదనీటి ప్రవాహం పెరగడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి అండర్ పాసేజ్ కింద, రెండుకు ఇవైపులా సర్వీసు రోడ్డుపై నీరు అధికంగా చేరింది. వర్షం కురిసిన ప్రతిసారీ నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 40 గ్రామాలకు ప్రధాన రహదారి ఇదే. ఇంత ప్రాధాన్యత కలిగిన రోడ్డులో వర్షం నీరు నిల్వ లేకుండా అధికారులు చూడకపోవడం శోచనీయమని స్థానికులు అంటున్నారు. కాలువల ఆక్రమణలకు గురి కావడం, టీడీపీ నాయకుడు అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్‌హెచ్ అధికారులు కూడా పట్టించుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తం అవుతోంది. శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, గొట్టిపల్లి వాసులు కోరుతున్నారు.

గ్రామానికి అవసరమైన పనులు గుర్తించాలి

కొత్తూరు: ఆదికర్మయోగి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి అవసరమైన పనులను గుర్తించాలని సీతంపేట ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని అడ్డంగి గిరిజన పంచాయతీ పరిధిలోని దిగువ మల్లేలగూడ గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. గ్రామంలో గుర్తించిన పలు సమస్యలను యాక్షన్ ప్లాన్‌లో పొందుపరచాలని అధికారులకు సూచించారు. ఆదికర్మయోగి జిల్లా మాస్టర్ ట్రెనర్ పొట్నూరు కోటిబాబు, పలువురు అధికారులు, పలు శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.ఎస్.స్వామి

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎస్.స్వామి అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించారు. నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఉషాపద్మిని మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధ్యాపకులు సాయికుమార్, శ్రీనివాసరావు, రాజశేఖర్, బాలరాజు, జగన్నాథరావు, ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాతపట్నం: విద్యార్థులు చిన్నతనం నుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని మండలంలోని పెద్దసీది జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బి.సింహాచలం అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయులు ఎల్.లక్ష్మీనారాయణ, సి.హెచ్.బాబూరావు రచించిన 'జంగ్లిష్' పుస్తకాన్ని విద్యార్థులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల జీవిత ఆశయాలు, మనోభావాలు, కుటుంబ నేపథ్యం, తదితర అంశాలు ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఉపాధ్యాయులు మధుసూదనరావు, అల్లాడ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాపై నిర్లక్ష్యం..!

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం సచివాలయం సిబ్బంది జాతీయ జెండాపై నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ ఏడాది స్వతంత్ర దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జెండా కట్టిన పోల్‌తోపాటు స్టోర్ రూమ్‌లో మూలనపెట్టారు. పోల్‌కు ఉన్న జాతీయ జెండాను తీసి మడత పెట్టి భద్రపర్చాల్సి ఉన్నా.. సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. జాతీయ జెండా ఎగుర వేసినప్పుడు, భద్రపర్చినప్పుడు పలు నియమాలు పాటించాల్సి ఉంది. అటువంటి నియమాలు పాటించిన దాఖలాలు సిబ్బందిలో కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సచివాలయం స్టోర్ రూమ్‌లో పోల్‌కు చుట్టి ఉన్న జాతీయ జెండా



చెరువు కాదు.. ఆర్టీసీ కాంప్లెక్స్



పాతపట్నం మండలంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో భారీగా వర్షం నీరు చేరింది. వర్షం నీటిలో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఏడు సెంటీ మీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

- పాతపట్నం

అల్లుకున్న నిర్లక్ష్యం

పాతపట్నం మండలంలోని తీమర బస్టాండ్ సమీపంలో గల రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ వైర్లు ఒకదానికి మరొకటి తగిలి నిప్పులు విరజిమ్ముతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్తంభానికి ఉన్న పాదులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పాతపట్నం



కోతకు గురైన రహదారి

పాతపట్నం మండలంలోని బడ్డుమర్రి పంచాయతీ పరిధిలో గల కోనంగి నుంచి భీమునిపేటకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. ఐటీడీఏ పరిధిలో గల ఈ రహదారి నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

- పాతపట్నం



అన్నదాత పోరును విజయవంతం చేయండి



పాతపట్నం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: ఈ నెల 9వ తేదీన టెక్కలి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్న అన్నదాత పోరు ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ కోరారు. పాతపట్నంలోని అంతరాబ కూడలి వద్ద అన్నదాత పోరు పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. టెక్కలి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు, ఆర్టీఐ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, నియోజకవర్గ కల్చరల్ అధ్యక్షుడు పడ్డ నేతాజీ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గోకవలస రాము, తూలుగు ప్రవీణ్, దకర చిన్నారావు, పనుకు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు..

మెళియాపుట్టి: రైతుకు అందించాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, పలువురు సీనియర్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీన టెక్కలిలో నిర్వహించనున్న ర్యాలీకి పార్టీ శ్రేణులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆదినాయుడు, కోఆప్షన్ సభ్యుడు భాస్కర దాస్, సీనియర్ నాయకులు ఉర్లాన బాలరాజు, లింగాల సంజీవరావు, అలికాన మాధవరావు, నక్క బాబూరావు, సవర సుభాష్, బైపోతు ఉదయ్‌కుమార్, కరణం శశిభూషణరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ విక్రాంత్‌కు అభినందన



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల నియమించారు. కొత్తూరు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండకు వెళ్లి విక్రాంత్‌కు అభినందనలు తెలిపారు. విక్రాంత్‌ను అభినందించిన వారిలో ఎంపీపీ వసర సావిత్రి, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, అగతమూడి నాగేశ్వరరావు, నాయకులు సవర రమేష్, అంపిలి బుచ్చిబాబు, సింహాద్రి, పోలయ్య, ఎండు నాయుడు తదితరులు ఉన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న కృష్ణారావు

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెవలస ప్రాథమిక పాఠశాలను సరుబుజ్జిలి స్కూల్ క్లస్టర్ హెచ్‌ఎం ఎస్.కృష్ణారావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మౌలిక సదుపాయలు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూను సక్రమంగా అమలు చేయాలన్నారు. హెచ్‌ఎం మోహనరావు, సీఆర్‌ఎంటీ బెండి చిన్నారావు పాల్గొన్నారు.